అంతర్వ్యాప్తి

ఉషశ్రీ

"మీరా యిద్దరికీ ఎన్నాళ్ళనుంచి స్నేహం?" అని గడపలో కాలు పెడుతూనే ప్రశ్నించిన లలిత వైపు తెల్లబోయి చూశాడు రామారావు.

ఒక్క క్షణం అలానే చూసి:

"ఇంత ఎండలో వచ్చి, వస్తూనే యిలాంటి ప్రశ్న వేశావేమిటి లలితా?" అని నాలుక కొరుక్కుని-ఏకవచన ప్రయోగానికి-క్షమా భిక్ష నర్థించే ముఖం పెట్టాడు.

"అదికాదు ఆయన్ని అసలు నువ్వు ఎంత కాలం నుంచి ఎరుగుదువు?"

అని ప్రశ్నను రెట్టించి అడిగి, రామారావు లానే తనూ పొరపాటుగా సంబోధించినందుకు కొద్దిగా బాధ పడింది లలిత.

లలిత ఏకవచనంలో సంబోధిస్తోందో, గౌరవార్థక బహువచన ప్రయోగం చేస్తున్నదో అవగతం చేసుకునేటంత తీరిక రామారావుకి ఆ క్షణంలో లేదు. ఒకవేళ అవగతం చేసుకోగలిగినా తన పొరపాటుకీ, ఆమె అనేసినదానికీ చెల్లు పెట్టుకుని తృప్తిపడేవాడు.

లలిత కూర్చున్నది.

లలితను కూర్చోమని చెప్పాలనుకోలేదు రామారావు.

రామారావు చెప్పేవరకూ కూర్చోకూడదని లలిత అనుకోలేదు. అనుకోకపోయినా అతను ఆమాట కాస్తా అనేస్తే అదో అందం. అందమే కాని ఇరవైయొనిమిది సంవత్సరాల వయసు వచ్చినా వివాహాన్ని గురించీ, జీవితాన్ని గురించీ ఆలోచించుకోలేని రామారావుకి అలాంటి అందాలేం తెలుస్తాయీ?

తెలీవని లలితకు తెలుసు.

తెలుసును కనుకనే లలిత కూర్చున్నది.

కూర్చున్న లలిత రెండు నిమిషాలకన్న నిశ్శబ్దాన్ని సహించలేక పోయింది. బైట ఎండతీవ్రం గదిలోకి రాకపోయినా, వాతావరణంలోని తాపం గది నిండా వ్యాపిస్తూనే ఉంది. లలిత మాట్లాడటానికి ఉపక్రమించబోయేసరికి ఆమె నుదురుమీద పట్టిన చిరుచెమట బిందువులన్నీ ఏకమై కనుగొలకుల్లో పడి చురుక్కుమనిపించాయి, కుర్చీ ప్రక్కగా ఉన్న మంచం మీది తువాల్‌తో ముఖం ఒత్తుకుని:

"అన్నట్టు మీ యింట్లో మంచినీళ్లుంటాయా, మేష్టారూ?" అని ప్రశ్నించి చిత్రంగా నవ్వింది.

రామారావు నోటితో ఏ జవాబూ ఇవ్వకుండా ప్రక్క గదిలోకి వెళ్ళి కూజా గ్లాసూ తెచ్చి ఆమె దగ్గర పెట్టాడు.

లలిత మరోసారి ముఖం మెడా తువాల్‌తో ఒత్తుకుని, మోచేతుల దగ్గర్నుంచి శుభ్రంగా తుడిచి, కాస్త ముంగుకు వాలి గ్లాసులోకి నీళ్లు పోసుకుంటూ:

"మీరు కూడా తాగుతారా?" అని ఓరగా చూసింది.

"ముందు నువ్వు కానియ్యి. చాలా దూరం ఎండలో నడిచి వచ్చావు" అన్నాడు, సానుభూతిని ప్రకటిస్తూ రామారావు.

"అంత శ్రమ పడలేదులే. కారుమీదే వచ్చా. చూశావా, మగవాడికీ, ఆడవాళ్ళకూ ఉండే తేడా. ఈ రావడం నేను కాక రంగారావే వచ్చి, ఆయనే మంచినీళ్ళడిగితే కూజా, గ్లాసూ యిలా పెట్టేసేవాడివేనా? క్షమించండి; ఏమిటో ఈ వేళంతా నాలుక నేను చెప్పినట్టు వినటం లేదు."

అని వరసగా రెండు గ్లాసులు తాగి, కూజా మీద గ్లాసు ఉంచేసింది. రామారావు దిద్దుతూన్న పేపర్లకట్ట బొత్తైటి, దానిమీద ఫైల్ పారేసి, సిగరెట్ వెలిగించి :

"ఈ సిగరెట్ అలవాటుదగ్గర మా స్నేహం ఆరంభ మయింది" అని ఆగాడు.

"కొందరికి అరవయ్యో యేట గురభ్యాసాలు ఆరంభం కావొచ్చు......" అని ముఖం ఒత్తుకునే నెపంతో కన్నులు మూసుకుంది.

"కావచ్చు కానీ, మాయిద్దరి వయస్సూ కలిపినా అరవై కాదుగా."

"కాదుగా అంటే నాకేం తెలుసూ, ఈ ప్రపంచంలో ఉన్నవాళ్ళందరి వయస్సుల్నీ తెలిపే పట్టీలు నా దగ్గర లేవు"

"అయితే పోనీలే, గూటీబిళ్ళ లాడటం దగ్గర్నుంచి మీ ఇద్దరికీ స్నేహం"

"ఇది మరీ బావుంది. నేను చదివేప్పుడు భీమవరం కాలేజీలో డిగ్రీ కుర్రాళ్ళుకూడా గూటీబిళ్ళలాడేవారు"

అని పకాల్న నవ్వింది.

రామారావు కూడా నవ్వుతాడనుకుంది.

అనుకుంది కానీ, అనుకున్నట్టు రామారావు నవ్వనంతలో పరాభూత మాత్రం కాలేదు.

"మేమిద్దరం ఒక ఊరివాళ్ళం. మా యిద్దరి చదువూ ఒకేచోట ప్రారంభమై, ఒకేచోట ముగిసింది. ఈ విషయా లన్నీ ఇదివరకే వాడు చెప్పిఉండాలే".

"చెప్పారేమో, అంత గుర్తు లేదు. అయితే ఆయన చదువుకునే రోజుల్లో ఆయన్ను గురించి ఏమనుకునేవారు?"

"ఓస్, ఈ ప్రశ్నకోసం ఇంత ఎండలో వస్తావనుకోలేదు లలితా. మూడు, నాలుగేళ్ళనుంచీ కాపురం చేస్తున్న నువ్వు నీ భర్త గతజీవితాన్ని గురించి తెలుసుకోవాలని కుతూహల పడుతున్నావంటే నాకు ఆశ్చర్యంగా ఉంది"

"ఔను, నాకూ ఆశ్చర్యంగానే ఉంది, వర్తమానంలో రంగారావు వ్యవహారం"

అని ఒక్కసారిగా ముఖంలోని చిరునవ్వునీ, ప్రసన్నతనీ మాయం చేసేసింది"

"అంటే"

అని ముందుకు వంగి కూజా అందుకున్నాడు.

"మంచినీళ్ళు నేనిస్తాగానీ, కరెంటు వచ్చిందేమో చూసి కాస్తంత ఆ ఫాన్ ఈ ప్రక్కగా యిద్దరికీ తగిలేట్టు పెడ్తారా?"

'ఫాను బొత్తి మందగిస్తోంది సుమీ. పేపర్లు దిద్దుతూండగా ఎగిరి పోతున్నాయని ఇందాక నేనే కట్టేశాను"

అని స్టూల్ యిద్దరికీ మధ్యగా ఉంచి ఫాన్ దానిమీద ఉంచి 'ఆన్' చేశాడు.

లలిత పంకాను కాస్త ప్రక్కకు నెట్టి గ్లాసు దాని ప్రక్కనే ఉంచింది. రామారావు గ్లాసు ఖాళీ చేసి :

"ఏమిటంటున్నావూ, రంగారావు తెలివితేటల్ని గురించి కాదూ......వాడు బ్రహ్మాండమయిన తెలివయిన వాడనీ, వాడివల్ల కాలేజీకే పేరొస్తుందనీ వాడు ఎన్ని ఆటలాడినా, పాటలు పాడినా ఎప్పుడూ వాణ్ణి పిలిచి - కనీసం-ప్రిన్సిపాలు కూడా మందలించే వాడు కాదు. బహుశా వాడు ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ యూనివర్శిటీ రికార్డు బ్రేక్ చేసినట్టు నీకు తెలిసి ఉంటుంది"

"అన్నీ నాకు తెలిసినవే చెప్తున్నారు"

"కాలేజీ లెక్చరర్ అంతకు మించి ఏం చెప్పగలడు లలితా! ఈ చమత్కారం చూశావా, ఇదే రంగడయితే నీకు తెలిసిన దాన్ని కూడా, నువ్వు ఎరగనట్టు చెప్పగలడు. ఇంతకూ సారాంశం ఏమిటంటే వాడు చాలా తెలివయిన వాడనే అభిప్రాయానికి భిన్న వాక్యం ఆరోజుల్లోనే కాదు, ఈ రోజున కూడా నేను అననూ లేను, విననూ లేదు"

అని చేతిలోంచి జారిపడ్డ సిగరెట్, కాలితో నలిపేస్తూ, టిన్నులోంచి ఇంకొకటి తీసి వెలిగించాడు.

"నే నడిగేది తెలివితేటల విషయం కాదు. రంగారావు ఆ మాత్రం తెలివయినవాడు కాకపోతే నే నతనికి భార్య నయేదాన్నీ కాదు; అయినా పోస్టు గ్రాడ్యుయేట్ కంప్లీట్ కాకుండా కాపరానికి వచ్చే దాన్నీ కాదు"

అని ఆగి, కూర్చున్న కుర్చీలోంచి లేచి పడక కుర్చీలో నడుం వాల్చి, తలప్రక్కకు తిప్పి, తలగడా ఆసరా చేసుకుని, దానిమీద ఒక పార్శ్వం ఆన్చి :

"చెదపురుగులా పుస్తకాల్ని తినేస్తూ, ప్రొఫెసర్ల అడుగులకి మడుగు లొత్తుతూ, ఏ విధమయిన చైతన్యమూ లేని వాళ్ళంటే నాకు పరమ అసహ్యం. మనం చదివే టప్పుడు అలాంటివాళ్ళు ఏ అరడజను

మందో ఉండేవాళ్లు గుర్తులేదూ ..నువ్వెరగవేమోలే. వాళ్ళు నాతోనే చేరారు. అప్పటికి మీరిద్దరూ రిసెర్చి చేస్తున్నారు. వెంకటేశ్వరరావు, విశ్వనాథం, సోమేశ్వరరావు, సరోజిని, డేనియల్, మెహరున్నీసా వీళ్ళంతా చెదపురుగులకంటె అధ్వాన్నంగా ప్రేమించే వారు పుస్తకాల్ని. ఆపాతగోడవంతా దేనికిలే. ఇప్పుడు నేనొక విషయం చెప్తే నువ్వు ఆశ్చర్య పడవు కాదూ"

అని ఆగి, యిరువురి వైపూ పరిభ్రమిస్తూన్న పంకా తన వైపు తిరగ్గానే మీట నొక్కేసింది.

రామారావు రెండు, మూడు నిమిషాలు ఏ జవాబూ ఇవ్వలేదు. నిశ్శబ్దంగా కూర్చుని తను పీల్చి వదులుతూన్న పొగవైపూ, దాని వివిధాకృతుల వైపూ విచిత్రంగా చూస్తూన్నాడు. అతని కన్నుల ఎదురుగుండా యూనివర్శిటీ వాతావరణం - నవనవలాడుతూన్న యవ్వనంతో ప్రవేశించి, తారాజువ్వల్లా ఎగిరి, ఎగిరి మొదటి సంవత్సరం తిరిగేసరికి కాలిపోయిన జువ్వ తాలూకు కొబ్బరి చువ్వల్లా అయిపోయిన యూనివర్శిటీ స్టూడెంట్సూ, తెలివితేటలున్నా - ప్రొఫెసర్ అనుమతిలేకుండా - ప్రదర్శించి నందుకు శిక్షగా మూడో క్లాసుతో జీవితాన్ని అనుభవించటానికి పోయే వాళ్లూ...ఆలోచనా లహరిలో ఆనందనౌకాయానం చేసే రామారావు వైపు డేంజరులైట్‌లా చూసి:

"నువ్వేదో ఆలోచిస్తున్నట్టున్నావు?"

అని లేవబోయింది.

"లేదు, లేదు......సరోజినీ, మెహరున్నీసా అంటే వింటున్నా"

అప్రయత్నంగా అనేశాడు.

"మనస్సు అటు పోయినట్టుంది"

అని క్రింది పెదవి పైపంటితో నొక్కి,

"నువ్వు ఇంటిదగ్గర ఉండవేమో అనుకున్నాను. కారులో ఫ్లాస్కు వదిలేశాను. తెస్తానుండు"

అని చకచక నడిచింది.

లలిత మాట్లాడదలచుకున్న దేమిటో రామారావుకి స్పష్టంగా అర్థం కాలేదు. కాకపోయినా లలితకు తనమీద ఎటువంటి అభిప్రాయం ఉందో? అభిప్రాయంకంటే అభిమానం ఎంత తూకంలో ఉందో ఎంతో కాలంనుంచి తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది. ఇటువంటి అవకాశం ఇదివరలో దొరక్కపోలేదు కాని ఏమిటో అవకాశం దొరికినప్పుడు అవసరమయిన ఆలోచన కలగడం అదృష్ట లక్షణం కాదూ ...అని తనలో తానే పొంగిపోయాడు.

లలిత ఫ్లాస్కుతో లోపలకు వస్తూనే మూతతీసి

"మీ యింట్లో గ్లాసు లుండా లనుకుంటాను"

అంది.

"తెమురు మంచితీర్థం పుచ్చుకున్నది గ్లాసుతోనే అని మనవి చేస్తున్నాను" అని నవ్వాడు.

లలిత నవ్వలేదు, నవ్వినట్లు భ్రమింపజెయ్యనూ లేదు. లేదు కానీ గ్లాసునిండా పోసి కాఫీ అతని కిచ్చి ఫ్లాస్క్ మూతలో తను పోసుకు తాగసాగింది.

"రంగారావు మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు తెలుసా?"

అని పేముకుర్చీలో కూర్చుని ఫ్లాస్క్ కింద పెట్టింది

"W-H-A-T-!!" (హ్వాట్!!)

అన్నాడు గ్లాసు రెండుచేతుల మధ్యలో నొక్కి పట్టి, లలిత కన్నులలోకి తన అచంచల దృష్టిని ప్రసరిస్తూ.

"ఔను...ఒక అమ్మాయిని చేరదీసి ఆమెకోసం యిల్లు అద్దెకుతీసుకుని, ఆమెకు కావలసిన సదుపాయాలన్నీ చూస్తూ, రాత్రి పన్నెండింటి వరకూ షికార్లు కొడుతూ, పార్కుల్లో, బీచీలో విహారాలు చేస్తూ, బాల్కనీలో కిలకిల నవ్వుతూంటే...ఇంతకంటె వేరే మంగళసూత్రం కట్టి, మంత్రాలు చదివితేగాని పెళ్లయి నట్టు కాదా?"

అని చీరచెంగుతోనే ముఖం ఒత్తుకుంది.

"నమ్మలేను లలితా"

గుహాద్వారంలో నిలబడి పలికినట్లు పలికాడు రామారావు.

లలిత పిచ్చిగా నవ్వింది.

నవ్వి ఊరుకోలేదు; ఊరుకోక పెదవి విరిచింది.

రామారావు చకితుడయాడు.

లలిత, పంకా వేగాన్ని తగ్గించింది.

లలితా, రంగడికి నీమీద ఎంత అనురాగమో నీకు తెలీదు. బహుశా చదువుకున్న అమ్మాయి లందరి

లానే నీకూ అతనిమీద మోజు తగ్గుతూన్నట్లుంది. నేనొక్క ప్రశ్న అడుగుతాను, చెప్తావా...కోపగించుకోనంటే అడుగుతా?"

అని కుర్చీలోంచి లేచి, కిటికీవైపు నడిచివచ్చి కుర్చీమీద కాలానాడు.

"అధునాతన సంప్రదాయాల ననుసరించి ప్రేమించి ఒకరి మనస్తత్వాలను మరొకరు అర్థం చేసుకుని మా యిద్దరి మధ్యా కేవలం భౌతికమయిన మోహమే కాక ఆత్మీయమయిన అనురాగం కూడా ఉన్నదని నిశ్చయించుకున్నాక నే, సనాతన సిద్ధాంతా న్ననుసరించి మంత్ర-తంత్ర యుక్తంగా మా యిద్దరికీ వివాహం అయిందని నీకు తెలుసు."

అని కుర్చీలో ముందుకు వంగి కుడి మోకాలు మీద ఉంచిన ఎడం కాలుపై మోచెయ్యాన్ని పైకెత్తి క్రింద పెదవిని తర్జనీ-బొటన వ్రేళ్ళ మధ్య బిగించింది. ఆమె కన్నులు అర్ధనిమీలితాలై ఉన్నాయి. ఎడమ కాలి పాదం కొద్దిగా ఊగుతోంది.

"అంతా ఏదో కొత్త కథలా చెప్తున్నావ్ లలితా; నేనూ-రంగడూ ఫైనల్ పూర్తిచేసి రిసెర్చి కొచ్చే వరకూ నువ్వు యూనివర్సిటీకి రాలేదు. రిసెర్చి రోజుల్లో నువ్వు వాడి జీవితంలో ప్రవేశిస్తున్నప్పుడు నేను కొద్దిగా భయపడ్డాను. అయితే నాకు రంగణ్ణి ఎప్పుడు చూసినా "డాల్ఫిన్స్‌నోస్" ప్రత్యక్షమయేది. ఎన్ని వందల సంవత్సరాలనుంచో సముద్ర తరంగాల తాకిడిని నిర్లక్ష్యం చేస్తూ, ఎన్ని తుపానులొచ్చినా నిర్లిప్తంగా ఉన్న ఆ కొండలాంటి జీవితం వాడిది."

అని ఆగి భారంగా నిట్టూర్చాడు, రామారావు.

"అది సరే, ఆ విషయం కూడా నాకు తెలుసు. రిసెర్చి రోజుల్లోనే ఆయనంత నిర్లిప్తంగా ఉండేవారు. అది కాదు, ఇప్పుడాయన వ్యవహారం చెప్పాను కాదూ. ఇది సుమారు సంవత్సరం నుంచీ సాగుతోంది. అయినా నేనేం పట్టించుకోలేదు."

"సంవత్సరం నుంచీ...!"

అని తెరచిన నోరు తెరచినట్లే ఉంచాడు.

"ఔను, అదేం పెద్దకాలం కాదు...మానవ జీవితంలో నవగ్రహాల దశలూ తిరగాలంటే నూట ఇరవై సంవత్సరాలు పడుతుంది. అందులో ఒక సంవత్సరం అంటే శతాంశం కూడా కాదు. అయితే ఈ విషయాన్ని ఇంత కాలం ఎవరికీ ఎందుకు తెలీనివ్వలేదని మీ అనుమానం...కానీ, పెళ్ళయిన కొత్తలో మా యింటికి మీరు వారానికి రెండు రోజులయినా వచ్చేవారు. అది రాను రాను నెలకు రెండు సార్లుగానూ, అయనానికి రెండు మూడు సార్లుగానూ మారిపోయింది. ఈ మధ్య రెండు నెలలనుంచీ సెలవలయినా మీ రటు రావటమే లేదు."

"ఔనౌను! నాకసలు బైట ప్రపంచం ఎలా పోతుందో తెలీటంలేదు లలితా, కాలేజీ పేపర్లు ఇప్పటికి దిద్దలేదు. యూనివర్శిటీ ఎగ్జామినర్ షిప్‌తో కొంతకాలం వ్యర్థమయింది. దేశంలో రెండు, మూడు నవలల పోటీలూ, నాలుగైదు కథానికల పోటీలూ నడుస్తున్నాయి. మొత్తం అన్నింటిలోనూ పాల్గొందామని ఉంది. ఏ రెండు బహుమతులిచ్చినా మా చెల్లి పెళ్లికి ఓ వెయ్యి రూపాయలు మా నాన్న కివ్వగలుగుతాను. అందు చేత..."

"అయితే మంచి పనే చేస్తున్నారు. ఇందాక నాకు కోపం రాకపోతే ఏదో ప్రశ్న అడుగుతానన్నారు. అది కానీండి."

"ఔనౌను...ఒక్క క్షణం ఆగు. యూనివర్శిటీ చదువు మొదలు పెట్టిన దగ్గర్నుంచీ కొంచెం మరుపెక్కువయింది...ఆఁ అదీ...అయితే ఇంతకూ నీకు రంగారావు మీద ప్రేమ యథాపూర్వం ఉందా? నీ మనస్సుకు బాధ కలిగితే జవాబివ్వకు."

అని ఒక విధమయిన ఆతురతతో కూడిన కుతూహలాన్ని వ్యక్తీకరించే దృష్టి సారించాడు.

లలిత చిన్ననవ్వు నవ్వింది.

నవ్విన లలిత బుగ్గల్లో చిన్న సొట్టలు పడ్డవి.

సొట్టలుపడ్డ లలిత బుగ్గలు రామారావు కన్నుల్లో ఒక కాంతినీ, మరొక కోరికనూ ప్రతిఫలింపజేశాయి. చేసినా రామారావు అమాయకంగా అలా చూస్తూనే కూర్చున్నాడు.

"రంగారావు మీద నా ప్రేమ యథాపూర్వం ఉన్నదా? అనే ప్రశ్న కర్థంలేదు. మిష్టర్ రామం, ప్రేమ అనేది యిరువురి మధ్యా ఉండవలసింది. అది అయస్కాంతం వంటిది, ఉత్తర - దక్షిణ ధ్రువాలు రెండూ ఉండాలి. ఇప్పుడు బహుశా నీ సందేహం నివృత్తి అయి ఉంటుంది"

అని సొంపుగా తలవంచి అతని వైపు ఓరగా కోరచూపు చూసింది.

"అర్థమయింది. అయితే అసలు రంగడు అలా అవటానికి కారణమేమై ఉంటుందని నువ్వు "ఊహిస్తున్నావ్?"

"అదే అర్థం కాలేదు ఆదిలో...కాని రాను రాను తెలుసుకున్నా...విశేష మేమిటంటే పెళ్ళయిన మొదటి రెండు, మూడేళ్లూ ఆయనా, నేనూ కూడా పిల్లల్నిగురించి ఎప్పుడూ ఆలోచించ లేదు...."

అని లలిత యింకా చెప్పబోతుండగానే, రామారావు అడ్డుకుని :

"ఇంత బుద్ధిలేని మూర్ఖుడై పోతాడనుకో లేదు. నేను మాట్లాడతానుండు వాణ్ణి పిలిపించి...."

అని కుర్చీలోంచి లేచాడు.

"మిష్టర్, అలా కూర్చోండి. ఆయన మీ కాలేజీలో చదివే స్టూడెంట్ కాదు, పిలిచేసి, కేక వేసి, ప్రిన్సిపాల్ చేత ఫైన్ వేయించి, సస్పెండు చెయ్యటానికి..."

అని కిలకిల నవ్వి, అంతలో గంభీరమయిన కంఠంతో :

"జీవితంలో ఒక స్థిరమయిన స్థితి ఏర్పడి, సాలీనా పది పన్నెండు వేల రాబడివచ్చే స్థాయికి వచ్చాక కాస్తంత యింట్లో పిల్లలుండా లనిపిస్తుంది. ఆయనకే కాదు, ఆ కోరిక నాకూ అప్పుడే మొలకెత్తింది కానీ......."

అని సిగ్గుతో తలవాల్చి, మళ్ళీ రెండు క్షణాల్లో కోలుకుని :

"అమ్మను కావాల నేకోరిక ఆడదాని కున్నంతగా తండ్రిని కావాల నే కోరిక పురుషుడి కుండదు. ఈ రహస్యం ఆయనదగ్గర చెప్పే సాహసం నాకు లేకపోయింది. నా హృదయంలో ఆయన మూర్తి ఎంత గాఢంగా చిత్రింపబడి ఉందో, అంత గాఢంగానూ మా అనురాగ ఫలోదయం కావాలనే వాంఛకూడా ఉన్నది..."

లలిత కంఠం గద్గదమయింది. ఆమె కనులు రెండు వేడికన్నీటి కణాలను ప్రసవించినవి.

రామారావు స్తబ్ధుడయి పోయాడు.

లలితవంటి మన స్తత్వంగల స్త్రీలకుకూడా మాతృత్వం మీద అంత బలమయిన వాంఛ ఉంటుందనీ, ఆ వాంఛ యింతగా హృదయాన్ని వేధిస్తుందనీ అతని జీవిత చరిత్రలోని ఏ పుటలోనూ వ్రాయలేదు.

"ఈ విషయాన్ని ఆయన రెండు, మూడుసార్లు కదిపితే నేను వేళాకోళంగా తీసి పారేశాను. నన్ను తృప్తిపరచటంకోసం ఆయన తాపత్రయ పడుతున్నారనే భ్రమించాను. భ్రమించిన విషయాన్నే ఇంతవరకూ భ్రమ అని తెలుసుకోలేక పోయాను."

"అప్పట్లో నేను తెలుసుకున్నా చేసేదేమీ లేదుగా"

అని వెనక్కి వాలింది.

"ఏమీ లేకపోవటమేమిటి? వాడి ఎదురుగుండా నువ్వు ఇంకోవాడితో షికార్లు మొదలెడితే సరి..."

అని పళ్లు పటపట లాడించాడు.

అపరిమితమయిన వేదనను అణచుకుంటూన్న గంభీరముఖం అంతలో మారిపోయి, పకాల్న నవ్వింది లలిత.

"సాంసారిక విషయాలలో బ్రహ్మచారి సలహా ఇంతకన్నా యోగ్యంగా ఉండదులే. అయినా ఆ పాటి మాట సాహసం చూపించావు. అంతే చాలు. నీతో కలిసి తిరగమన్నావు కాదు".

అని గంభీరంగా కూర్చుని నిశితంగా అతని కన్నులలోకి చూసింది.

చూసిన లలిత చూపులు సరాసరి రామారావు హృదయంలో గిలిగింతలు పెట్టినట్లూ, అతని మనస్సును పలకరిస్తున్నట్టూ, అతని శరీర సర్వస్వాన్ని కాంక్షిస్తున్నట్టూ అనుకున్నాడు. ఒక్కసారిగా ఇన్నిటినీ లొంగదీసుకోవటం కష్టమే అయింది. అయినా నిగ్రహించుకున్నాడు.

"నీ కవసరమనిపిస్తే నా అభ్యంతరం లేదు."

అని తలదించుకున్నాడు.

ఈ వాక్యాన్ని లలిత విన్నది. విన్నదికాని విననట్లే:

"అయితే త్వరలోనే ఆయన స్థితి జారిపోతున్నది. అవతల పుస్తకాలు దిగుమతీ కావటం లేదు. అయినవి విడుదల కావటం లేదు. అయినా ఆయన

ఖర్చు మామూలుగానే ఉంది. ఈమధ్యనే యింకో కారుకొన్నారు. అది కూడా నా తృప్తికోసం. ఆయనకూ, ఆవిడకూ ఓ కారవసరం. నాకోసం పాత కారు ఉంచేశారు. సంవత్సరంలోగానే బహుశా బాంక్ బాలెన్సు ఏమీ ఉండకపోవచ్చు. అప్పుడు మా స్థితి.."

అని జేబురుమాల్ ఉండచుట్ట సాగింది.

"నీకేం భయంలేదు. నువ్వు ఏ క్షణంలో వచ్చినా ఈ ఇంటి సింహద్వారంలో నీకు స్వాగత వాక్యాలు లభిస్తాయి."

అన్నాడు రామారావు ఉత్సాహంతో.

"చాలు. ఆపాటి మాటంటే అదే పదివేలు. వస్తాను."

అని లలిత లేచి అడుగులు వేసింది.

ఆమె అడుగుల్లో అడుగులు వేస్తూ రామారావు గుమ్మంవరకూ సాగనంపి, కారు సందు మలుపు తిరిగే వరకూ అటే చూస్తూ నిలబడిపోయాడు.

2

లలిత రాత్రి తొమ్మిదింటివరకూ తిరిగి, తిరిగి ఇంటి కొచ్చేసరికి పూర్తిగా అలిసిపోయింది. కారు కాంపౌండులోనే ఉంచేసి, తాళాలుకూడా తీసుకోకుండా చక, చకా నాలుగడుగుల్లో తన గదిలోకి నడిచేసి, చీరా, జాకెట్ తీసేసి, టవల్ వల్లెవాటుగా వేసుకుని, స్నానాల గదివైపు నడిచేసింది. నీళ్లగదిలో అడుగు పెడ్తూ:

"ఒరేయ్ వెంకా, అన్నం వడ్డించెయ్యమనరా".

అనేసి లోపలకుపోయి తలుపు వేసుకుంది. వెంకడిచ్చిన జవాబు తలుపు వేసే చప్పుడులో లలిత విని పించుకోలేదు. ఆమె స్నానం అయి ఇవతల కొచ్చేసరికి వంటింట్లో ఏమీ శబ్దం వినబడకపోయేసరికి కొద్దిగా ఆశ్చర్యపడింది. డాబా మెట్లమీద, ఆరిపోతూన్న లంకాకుచుట్టతో కుస్తీపడుతూన్న వెంకడు లలితకు నవ్వును కలిగించాడు. లలిత నవ్వుతూనే:

"వెంకన్నబాబూ!...వడ్డించమని చెప్పలేదూ?"

అని ఒక్క క్షణం ఆగింది.

వెంకడు చికాకుతో చుట్ట విసిరేసి వచ్చి:

"ఈ రోజునుంచి వంటమనిషిని మాన్పించేసి, ఆవిడ కివ్వాల్సిన లెఖ్ఖ యిచ్చేశారండి అయ్యగారు సాయంకాలంవచ్చి"

అన్నాడు.

ఒక్క క్షణం లలిత స్తబ్ధురాలయింది. రంగారావు తనతో చెప్పకుండా ఇంటి వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోడాని కిదే ప్రథమం. అయినా దిగజారుతూన్న స్థితిని గుర్తిస్తున్నందుకు కొంత సంతోష పడింది.

"నిన్నుకూడా మాన్పిస్తానన్నారా?"

"ఏమోనండి, నన్ను బాబుగారు మానిపించినా మీ పాదాలుమాత్రం వదలను. అమ్మగారూ, డ్రైవర్ని కూడా ఇంక రావద్దన్నారండి"

"ఔను, ఆయనకారు ఆయనే నడుపుకుంటారు. మామూలుకారు అవసరమయినప్పుడు నేనే తీసికెడతాను. పోనీలే, బాబుగారు పొదుపు నేర్చుకుంటున్నారు. పైగా ఏ పనీ లేకపోతే నాకూ ఏమీ తోచటంలేదు. రేపట్నుంచి వంటపని కాస్త కాలక్షేపంగా ఉంటుంది"

అని నిట్టూర్చి లోపలకు నడిచింది.

3

లలిత రామారావుని కలుసుకున్న పదిహేను రోజుల అనంతరం యూనివర్సిటీలైబ్రరీలో చూశాడు. చూసినా నమ్మలేకపోయాడు. ఈ లైబ్రరీలో లలితకు పనేమిటో రామారావుకు అందలేదు. అందుకనే ఆమెను చూసి కూడా ఆమె లలిత కాదనుకున్నాడు. అనుకుని ముందుకు నడిచేశాడు.

"మిస్టర్ రామం!"

అని పిలుస్తూనే నిలబడింది లలిత.

రామారావు, నెగ్గబోతూన్న సూచనలు కనపడి, చివరకు రిజైన్ చేయాల్సిన పరిస్థితిలోఉన్న చదరంగపు ఆటగాడిలా వెనుదిరిగి నిలబడ్డాడు.

"మీరు రోజూ వస్తూంటారా?"

"అప్పుడప్పుడు"

"నేను కృష్ణారావుగారి పెర్మిషన్ తీసుకున్నాను. కానీ, యూనివర్సిటీ అబ్బాయిల తంతు మీకు తెలుసుగా—ప్రశాంతంగా చదువుకునే అవ

కాశం ఇవ్వటంలేదు. ఆ ఉపకారం కాస్త చేయించగలరా?"

"అంటే స్పెషల్ రూమ్ కావాలా?"

"అక్కర్లేదు. స్టూడెంట్సుహాల్ కాకుండా..."

"సరే, రా"

అని ముందుకు నడిచాడు.

లలిత అనుసరించింది.

రామారావు లలితను నేరుగా తన డిపార్టుమెంటు రూమ్‌కి తీసుకెళ్లాడు.

లలిత లైబ్రరీ ఆవరణ దాటుతూండగా కొద్దిగా శంకించి, ఒక్క నిమిషం నిలబడింది కానీ, ఏదో ఆత్మవిశ్వాసం అతని వెనకాలే నడిపించింది.

"అలా కూర్చో"

అన్నాడు రామారావు తన కుర్చీలో తాను కూర్చుంటూ.

టేబుల్‌కి అవతలవైపు నున్న కుర్చీలో లలిత కూర్చున్నది.

"కొంచెం కాఫీ తెప్పించనా?"

అని నెమ్మదిగా అడిగాడు.

లలిత తల ఊపింది.

అది తెప్పించటానికి అంగీకరిస్తున్నట్టో, అనంగీకారాన్ని సూచిస్తున్నట్టో మాత్రం రామారావుకి అర్థం కాలేదు. అయినా ఫ్లాస్క్ పంపించి తెప్పించటానికే నిశ్చయించుకుని ఫోన్ తీసి "కాంటీన్" పిలిచాడు.

"అయితే ఇప్పుడు నీకు లైబ్రరీ అవసరమేమిటి?"

ప్రశ్నించాడు.

"ఇప్పుడు కాకపోతే ఇక ముందు తీరిక ఉండొద్దూ"

"అంటే?"

"అంత అర్థం కాకుండా ఉందా నా తెలుగు?"

"భాష కాదు, నాకర్థం కానిది భావం"

"భావార్థం కానిదే భాష మాత్రం ఎలా అర్థమయినట్టూ?"

అని నవ్వింది.

రామారావు నవ్వలేదు. నవ్వడానికి ప్రయత్నించనూ లేదు.

"బహుశా మీకు కోపం వస్తుందేమో, నేను కూడా నవలా, కథానికల పోటీకి వద్దామనుకుంటున్నాను"

"వెరీ గుడ్, నా చేతనయిన సహాయం చేస్తాను. ప్రారంభిస్తూనే పోటీలో పాల్గొనాలనే కోరిక కలగటం మంచిదే"

"దానికేముందిలెండి, మీ యింటికొచ్చే బొద్దుగా, పొట్టిగా, కుదిమట్టంగా ఉండే ఆయన ఇప్పటికి రెండుమూడు వేగన్ల కాగితాలు ఖరాబు చేసినా-కనీసం-ఆయన అక్షరాలు కూడా గుండ్రపడ లేదని మీరే అన్నారుగా. అంచేత దీనికి అభ్యాసం కంటె అభినివేశం ఎక్కువవసరం కాదూ"

"ఔను. నేనూ అదే అంటున్నాను. నువ్వు పోటీకి వ్రాస్తూనే, ఈలోగా రెండు, మూడు పత్రికలకు కూడా కథలూ, నాటికలూ వ్రాస్తూండవచ్చు. పైగా నువ్వు లిటరేచర్ దానివి కనక ఇంగ్లీషులో రాస్తే ఎక్కువగా లాభిస్తుంది"

"ఏది లాభిస్తే దానికే వ్రాస్తాను. నాలుగైదు నెలల్లో నేను నా రచనలతో పోషించుకోగలగాలి.."

"ఏమిటీ!"

"అంత ఆశ్చర్యం దేనికీ. పైగా నేనూ, ఆయనా కూడా నా కలం మీదనే కొంత కాలం బ్రతగ్గలగాలి. ఇది సాధ్యమవుతుందంటారా?"

"సాధ్యమో, అసాధ్యమో చెప్పలేను కాని నెలకు రెండూ, మూడు వందలొస్తాయి. బహుశా అప్పుడు నువ్వు క్రేప్ సిల్కూ అవీ కట్టలేవేమో"

ఆ ప్రమాదం లేదులే. పదేళ్ళకు సరిపోయే చీరలూ, జాకెట్లూ ఇంట్లో ఉన్నాయి. అయితే కనీసం రెండువందలు తెచ్చుకోగలనంటావు."

"రాజులా...ఈ పోటీల్లో ఏ ఒకదాన్లో ఫసు వచ్చినా అయిదు వందలొస్తుంది"

"మీ ఆశీర్వాదం. నేనింక వెళ్లొస్తా. మీరొక్క ఉపకారం చెయ్యండి. అవసరమయినప్పుడు ఈ 'రూమ్' కొన్ని గంటలు నా కోసం వదిలేస్తూండండి. అత్యవసరం అయినప్పుడు ఫోనుచేస్తే పలికి, కావలసిన లైబ్రరీ పుస్తకాలు మాత్రం యిస్తూండండి.

అని లేచింది లలిత.

"నువ్వు కారు మీద రాలేదా?"

"కారు లేకుండా రావడం అసంభవం"

"అయితే ఒక్క పావుగంట ఉండ రాదూ, నేనూ వచ్చేస్తా"

"ఉందును కానీ, మెడికల్ కాలేజీ అమ్మాయిలిద్దరున్నారు. వాళ్లు ఫీలవుతారేమో క్షమించండి"

"ఫర్వా లేదులే. ఒక్క నిమిషం ఆగు. కాఫీకి పంపాం కదూ"

అని కూలబడ్డాడు కుర్చీలో. లలిత కాఫీ పూర్తి చేసి కదిలింది.

4

ఒక ప్రఖ్యాత తెలుగు మాసపత్రికలో లలిత మొదటి కథ ప్రచురింపబడింది. ఆ రోజున సాయంకాలం లలిత కారులో బయలుదేరి రామారావు ఇంటి దగ్గర ఆగింది. గేటుదాటి లోపల అడుగు పెడ్తూండగానే తోటమాలి వీరన్న అయ్యగారు ఊళ్లో లేరనీ, ఈ మేలులో దిగాలనీ చెప్పాడు. రామారావు ఊళ్లో లేడనగానే కొంత నీరసపడ్డ లలిత మేలులో దిగుతాడనే సరికి అపారమైన సంతోషాన్ని పొందింది. మళ్లీ కారులో కూర్చుంటుండగా వీరన్న వచ్చి:

"ఎవరో ఫోనుపిలుస్తున్నారు. కొంచెం కబురు చెప్పేసి వెళ్ళండి"

అని వంగి నిలబడ్డాడు.

లలితకు చికాకు కలిగింది. సరిగ్గా మేలు రావటానికి అయిదు నిమిషాల టైం ఉంది తనవాచీ ప్రకారం. తక్షణం బయల్దేరితే అతన్ని స్టేషన్లో కలిసికోవొచ్చు. మధ్యలో ఈ ఫోన్ కాల్. బహుశా రామారావుని ఫోనులో పిల్చే వారెవరుంటారు? ఎవరనేమిటీ? అతని లోకగొడవా? ఒక లోకమా? ఒక వేళ రంగారావు పిలుస్తూంటే... ఈ ఆలోచన రాగానే కారుదిగి వీరన్న దగ్గర తాళాలు తీసుకుని లోపలకు నడిచి, ఫోను ఎత్తి:

"హలో!"

"ఎవరదీ? లలితా!"

"ఔనండీ, మీరెవరో తెలీటం లేదు"

"ఇప్పుడు నువ్వు మాట్లాడుతున్నది రామారావు ఇంటి దగ్గర్నుంచేనా?"

"అసలు మీరెవరో చెప్పకుండా ఏమిటీ అనవసర ప్రసంగం"

"అంతకోపం దేనికమ్మా లలితమ్మా...... నేను కనుక్కోలేననుకున్నావా, నువ్వెక్కడినుంచి మాట్లాడేదీనూ? ముందు మీయింటికే 'రింగు' చేశా. ఎవరూ పలకలేదు. అప్పుడే అనుకున్నా; నువ్వు పత్రికతో రామారావుగారింటికి కెడతావని. అదికాదే, నువ్వు కథలూ, నాటకాలూ వ్రాస్తూన్నట్టు కాస్త చెప్పకూడదులే. ఇంతకీ నేనెవరో అర్థమయిందా? ఎక్స్ఛేంజ్, టెలిఫోన్ ఎక్స్ఛేంజి... తెలిసిందా!"

అంతవరకూ మాటలూ, ఆ తరువాయి నవ్వూ వినిపించాయి. లలితకు చికాకెక్కువయింది. అయినా ఎంతో పరిచితంగా, పైగా ఆరోజుపత్రికలో పడ్డ తన కథగురించీ, తను ఆకథతో రామారావు ఇంటికి...

"మీరెవరో తెలీటంలేదు."

"రంగారావు, రామారావులచేత 'సౌందర్యం' అని..."

"ఓస్! చంపేశావే... నువ్వటే.... ఈ మధ్య రాజమండ్రీ వెళ్ళినట్టు విన్నానూ?"

"నువ్వు అంతే విన్నావు. రాజమండ్రీనుంచి బెజవాడ అక్కడనుంచి మరోవాడ యిలాతిప్పి, తిప్పి చివరకు ఇక్కడాఫీసులో క్లార్కుగా వేశారు. సరే కానీ...మరి డిన్నరెప్పుడే?"

"క్లార్కుగా ప్రమోట్ అయినందుకు నువ్వివ్వాలా..."

"ఇంక చాల్లే...కొత్తగా రచయిత్రి వయినందుకు నువ్వే యివ్వాలి. లేకపోతే నీకు సజెషన్సు ఇస్తూ, పుస్తకాలు సప్లయిచేస్తూన్న రామారావుగారివ్వాలి. ఆయనన్నే యిమ్మను శిష్యదక్షిణ."

"బాగా జ్ఞాపకం చేశావుకానీ, రామారావుగారు ఊరునుంచి ఈ మేలులో వస్తున్నారట. కొద్దిగా శ్రమపడి స్టేషన్‌కి మేలు ఎంతలో వస్తోందో కనుక్కుంటావ్?"

"అయితే ఆగు.........

మేల్ ఇప్పుడే ప్లాటుఫారంమీద ఆగుతోందిట. నువ్వు కారులో బయల్దేరి మా ఆఫీసుకివస్తే మనిద్దరం కలిసి ఆయనకోసం దారి కాయవచ్చు"

"రైట్! వస్తున్నా"

అంటూనే ఫోన్ అక్కడ ఉంచేసి తలుపులు కూడా వెయ్యకుండా చకచక వచ్చేసి కారులో కూర్చుంది.

* * * *

తనదగ్గర ప్రైవేటుగా చదివి హిందీ విశారద, ఇంటరు తెలుగూ ప్యాసయినందుకు సౌందర్యానికీ, తన సూచనలతో నడిచి తొలిరచనను ప్రముఖపత్రికలో ప్రకటించిన లలితకూ రామారావు తన యింటిదగ్గర డిన్నరిచ్చాడు. ఆ రాత్రే సౌందర్యం బి యే. పూర్తి చేయటానికీ, లలిత పోటీలన్నిటిలోను పాల్గొనడానికీ నిశ్చయాలు జరిగిపోయాయి. రాత్రి పదకొండింటికి లలితా, సౌందర్యం కలిసి వెళ్ళిపోయాక రామారావు డాబామీద పడుకుని అనంతాకాశంలో అసంఖ్యాక తారాతోరణాలను అవలోకిస్తూ ఆలోచించసాగాడు. మానవుడు జీవించినంతకాలంలో ఏదో ఒక పరమార్థాన్ని సాధించలేకపోతే వాడిజీవితం పరమవ్యర్థం. ఈనాడు తను ఇద్దరమ్మాయిల భవిష్యత్తును స్వర్ణమయం చేయగలుగుతున్నందుకు తనను తాను అభినందించుకున్నాడు. లెక్చరర్ ఉద్యోగంతో ఎందర్ని వృద్ధిలోనికి తెచ్చినా అది జీతానికి చేసే పని. ఇప్పుడు చేసేది నిస్వార్థకృషి! రామారావు తృప్తిగా నిట్టూర్చి గుండెలమీద చేతులు వేసుకు నిశ్చింతగా నిద్రపోయాడు.

5

ఆరోజు కారోజు రంగారావు ఇంటిదగ్గరుండటమే అరుదయిపోతుంది; వచ్చినా ఏదో రెండు, మూడునిమిషా లుండటం, ఇంతలో 'ఫోన్‌కాల్' రావటం వెళ్లిపోతూండటం మాత్రమే జరుగుతున్నది. కొంతకాలంవరకూ లలిత—కాపరాని కొచ్చిన తొలిరోజులలో వలెనే—స్మిత శ్రీ రోచిఃపరిపూర్ణవదనంతో ఆహ్వానించటం సాగించింది, కానీ రంగారావు ఆ స్వాగతాలకు విశిషతను ప్రసాదించకపోయేసరికి నిర్లిప్తంగా ఊరుకో సాగింది. అది రంగారావులో ఏవిధమయిన పరిణామాన్ని తేలేదు సరికదా; లలిత నిర్లిప్తంగా ఉండటమే తనకు కొంత బెడదను తగ్గించినట్లు తృప్తిపడసాగాడు. ఒకటి, రెండుమాసాల నుంచి యిద్దరూ ఒకరిముఖం ఒకరు చూచుకోవటం కూడా ఏ రెండు, మూడుసారులో జరిగిందేమో! అంతే.

ఇందులో చమత్కారం ఏమిటంటే—లలితను పిలిచి: "నీకూ నాకూ ఈ రోజునుంచీ ఏవిధమయిన సంబంధమూ లేదు. నీ దారి నువ్వు చూచుకోవొచ్చు" అని రంగారావూ అనలేదు. రంగారావుని గుమ్మంలో నిలబెట్టి, సామానంతా కారులో ఎక్కించి. "ఇంక మనిద్దరికీ కాపరం పొసగదు. నేను వెడుతున్నా" అని లలితా చెప్పలేదు. రంగారావు—లలితా భార్యాభర్తలని ఎరిగిన వారు మాత్రం వారిద్దరూ సంసార సుఖాలను అనుభవిస్తున్నారనే భావిస్తున్నారు. ఒక్క రామారావుకి తప్ప మిగిలిన ఎవరికీ జరుగుతూన్న కథ ఏమిటో తెలీదు. కొత్తగా ట్రాన్స్‌ఫరయిన 'సౌందర్యం' కొద్దిగా తెలుసుకుందేమో; అంతే! కాలం గడుస్తున్న కొద్దీ లలితకు ఉత్తరాల సంఖ్య పెరుగుతున్నది; ఇతః పూర్వం రంగారావు తాలూకు టపా రోజూ ఓ సంచీతో వచ్చేది; ఇప్పుడది సన్నబడింది; ఎప్పుడో సరోజినీ, శారదా, హైమవతీ ఓ కవరు వ్రాసేవారు లలితకు, అంతకుమించిన ఉత్తరాలు లలితకు లేవు. ఈ రోజున ఆమె కనీసం నాలుగైదుకార్డులూ, ఒకటి రెండు కవర్లూ, అయిదారు బుక్ పోస్టులూ, వారానికి ఒకటి రెండు మనియార్డర్లూ అందుకుంటూన్నది. లలితకు తెలుగులో వ్రాయటంకంటె ఇంగ్లీషులో వ్రాయటం మరీ తేలికయింది; తేలికే కాదు ఇంగ్లీషు పత్రికాధిపతుల ప్రోత్సాహం, సహకారాలు తెలుగువారికన్న ఎన్నో రెట్లు ఎక్కువగా కనిపించాయి; అయినా మొత్తంమీద తెలుగులోనే ఎక్కువగా వ్రాసేది. అయిదారు మాసాలు తిరిగేసరికి 'లలిత' ఉన్నత శ్రేణి కథకులలో పరిగణనకు వచ్చింది.

'ఒక ప్రసిద్ధ మాసపత్రిక నడిపిన నవల పోటీలో లలిత వ్రాసిన ఒక కథ ప్రథమ బహుమానాన్ని పొందింది. అదే నవలను సర్వహక్కులతో పన్నెండు వందలకు కొన్నారు ఉదాత్త ప్రచురణ సంస్థవారు. లలిత అనుమతితోనే ఈ కాంట్రాక్టు 'ఆ పత్రికా సంపాదకవర్గం చేసి—పన్నెండు వందలకూ బహుమతి మొత్తం అయిదువందలూ కలిపి, మరో మూడు వందలు ఇంకో నవలకు అడ్వాన్సుగా యిస్తూ- మొత్తం రెండు వేలకు 'చెక్' పంపారు. పదిహేను రోజులు తిరగకుండానే మరొక వారపత్రిక కథానికల పోటీలో ద్వితీయ బహుమతి మూడు వందలూ, దాని ఇంగ్లీషు అనువాదపు సర్వహక్కులకు రెండు వందలూ కలిపి

అయిదువందలకు చెక్కు వచ్చింది. ఇవికాక మామూలుగా వచ్చే పదిహేనులూ, పాతికలూ వస్తూనే ఉన్నాయి. ఖర్చయినది పోగా లలిత 'బాంక్-బుక్'లో సంవత్సరం తిరిగేసరికి మూడు వేల రెండువందలు తేలింది. ఆమె పుస్తకాన్ని టేబిల్ సొరుగులో పడేసి ఒక వేడినిట్టూర్పు విడిచి, విడిచిన నిట్టూర్పుతో ఎంతో భారాన్ని వదిలేసి, సంతృప్తిగా సోఫాలో వాలింది.

* * * *

ఆ రోజునే పోస్టులో వచ్చిన, లలిత బహుమతి పొందిన నవల చదివి, భారంగా నిట్టూర్చి, సోఫాలోంచి లేస్తూండగా లలిత ప్రవేశించింది. ప్రవేశిస్తూనే చేతిలో ఉన్న 'బాగ్'లోంచి ఓ కాపీ అతని కందించి:

“మీరు అడిగినా చూపించకుండా పంపేశాను. మీ అభిశాపాలు తినక్కర్లేకుండా ఇది నాకు రెండు వేలు చేసి పెట్టింది. చదివి దీనిమీద మీ అభిప్రాయం చెప్తే కాని నాకు తృప్తిగా ఉండదు.”

అని పేము కుర్చీలో కూర్చుంది.

“ఇప్పుడే పూర్తి చేశాను. కాని ... నువ్వు నీ జీవితాన్నే ప్రప్రథమంగా నవలకు ఇతివృత్తం చేసి యింత కౌశలంతో నిర్వహించగలవనుకోలేదు. పూర్తిగా చదివాక రంగడు జిల్లేడుపొదలానూ, నువ్వు జాజిమల్లిలానూ...”

తలవంచుకుని, కిటికీలోకి చూస్తూ ఉపన్యాస ధోరణిలో సాగిపోతున్నాడు. లలిత అంతవరకూ ఆగింది, కాని, తను ఉద్దేశించిన భావమే అయినా - తనభర్తనూ తననూ మూడోవ్యక్తి ఆ విధంగా పోల్చటం ఆమెకు నచ్చక :

“నా ఊహ అదికాదు”

అని కొంచెం తీవ్రంగానే అంది.

“విమర్శకుడికి అలా అనిపించింది, పాఠకుడికీ అదే తోస్తుంది, ఇందర్నీ నువ్వు బతిమాలి వాళ్ళ అభిప్రాయాలు మార్చలేవుగా...అయినా ఇది ఒక్కసారి రంగడిచేత చదివించాలి. అప్పుడు కానీ...”

అని యింకా చెప్పబోతున్నాడు.

“అదిమాత్రం వద్దు. నిన్న సాయంత్రం యింటికొచ్చినప్పుడు అడిగారు, 'నువ్వేదో రాస్తున్నావుట' అని. అయితే ఆ ప్రశ్న నావైపు చూసికానీ, నన్ను సంబోధించికానీ అడగలేదు. గదిలో ఆయనా, నేనూ తప్ప ఇంకెవరూ లేనిమాట వాస్తవమే అయినా, కట్టుకొన్న పెళ్లాంతో మాట్లాడే విధానం అదేనా అనిపించి నేను జవాబివ్వలేదు. “ఫరవాలేదులే—ఈ దేశంలో ఆడ రచయితలకు సొమ్ము బాగానే ముడుతుంది. ఎప్పుడయినా అవసరమయితే మన బంధుత్వ రీత్యా కాకపోతే పూర్వస్నేహాన్ని దృష్టిలో ఉంచుకునయినా కాస్త సాయంచేద్దువుగాని” అని నవ్వుతూ వెళ్ళిపోయారు. అలా మాట్లాడుతున్నప్పుడు ఆయన సోఫాలో కూర్చుని మేజోళ్లు ఎక్కించుకుంటూండటంవల్ల ఆయన ముఖంలో ఏ భావం ద్యోతకమవుతున్నదీ గుర్తించలేక ఊరుకున్నాను. లేకపోతే రెండు బుజాలూ పట్టుకు నిలబెట్టి, ఆయన కన్నుల్లో కన్నులుంచి “మీకూ — నాకూ ఉన్న బాంధవ్యమేమిటి? మనిద్దరం భార్యాభర్తలం. భార్యాభర్తలమధ్య ఉండేది స్నేహమే కాని బంధుత్వం కాదు” అందామనుకున్నాను. అనుకున్నానంతే.”

అని దిగులుగా తలవంచింది.

“అంతటి మూర్ఖుడిముందు స్నేహానికి మాత్రం విలువేమిటి?”

అని ఛీత్కరించాడు రామారావు.

“మిస్టర్ రామం, ఏ విషయంలోనయినా మీ గురుపీఠానికి గౌరవం యివ్వగలను కానీ, నా భర్తను నా ముందుమాత్రం మీ యిష్టంవచ్చినట్టూ అంటే సహించలేను.”

అని కాస్త తీవ్రంగానే అంది.

“అది నీ తప్పుకాదులే. ఈ దేశపుస్త్రీల రక్తనాళాలలో పట్టేసిన వ్యాధి అది” అని నిట్టూర్చాడు.

“ఆ వ్యాధికూడా లేకపోతే ఈదేశంలో ఆడదానికున్న ప్రత్యేకతేమిటి మేష్టారూ” అని చిత్రంగా నవ్వింది.

లలిత నవ్వు రామారావు మనస్సుని మాఘమాసపు పొగమంచులా ఆవరించేసి, అతని హృదయంమీద సమ్మెటపెట్టు పెట్టింది. లలిత వాక్యం సిద్ధాంతాన్ని ఎంత తీవ్రంగా బలపరుస్తూన్నదో, ఆమె నవ్విన నవ్వు అంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వినిపించింది. అయితే లలిత నవ్వుతో ఏకీభవించాలో, ఆమె వాక్యాన్ని ప్రతిఘటించాలో మాత్రం రామారావు

కర్థం కాలేదు. కొద్దిక్షణాలు అప్రతిభుడయిపోయాడు. స్త్రీ బుద్ధి ప్రత్యగ్రమయినప్పుడు పురుషుడి తర్కవితర్క శక్తి ఏమీ సాధించలేదని నిశ్చయించు కున్నాడు. రామారావు సందిగ్ధంలో పడ్డట్టు గమనించింది లలిత. ప్రసంగాన్ని మార్చకపోతే మరీ బాధగా ఉంటుం దనుకుంది.

"ఇంతకూ గెటప్, ప్రింటింగ్ వగయిరా లెలా ఉన్నాయో..."

అని ఆగింది ఆతురతతో అతనివైపు మాస్తూ.

"ఈ పబ్లిషర్ ని నువ్వెరగవనుకుంటాను. ఔను, అసలు వాళ్ళు నీతో మాట్లాడలేదుగా. వాడు నా క్లాస్ మేట్ లే ఇంటర్ వరకూ. యూనివర్సిటీలో మాత్రం నేను లిటరేచర్ తీసుకుంటే, వాడు కామర్స్ పూర్తిచేశాడు. అప్పుడే వాడికి ప్రెస్సు పెట్టాలని ఉండేది."

"అయితే యిదంతా మీ చలవేనన్నమాట. నాతో చెప్పకుండా కూడా మీరు ఎన్నో ఉపకారాలు చేస్తున్నారు."

"ఇప్పటికీ ఇది చెప్పకపోదును. ఈ విషయం నీకు ముందుగా తెలిసిపోతే నీ ప్రతిభమీదకంటే నా సహకారం మీదనే నీకు విశ్వాసం ఏర్పడుతుంది. అప్పుడు నువ్వింత వృద్ధిలోకి రాలేవు. నువ్వు ఈనాడింతగా రాణిస్తున్నావంటే ఈ రహస్యం తెలీకపోవటంవల్లనే. అలా కాని పక్షంలో నువ్వేది వ్రాస్తే అదే అచ్చవుతుందని నమ్మి కృషిలో లోపం చేస్తావు."

"కావచ్చు...కానీ...నేనెంత ప్రతిభావంతురాల్నయినా మీ సహకారం లేకపోతే నేనింత త్వరలో అభివృద్ధిలోకి వచ్చేదాన్ని కాదు. నాకన్న ప్రతిభాసంపత్తి కలవా రెందరు లేరు; అవకాశ, సహకారాలు లేక..."

అని ఆగింది లలిత.

"నువ్వు చెప్పేంది పూర్తిగా అసత్య మనలేను"

అని, సిగరెట్ ముట్టించాడు.

"సరేలెండి...దీనికేంగాని మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడుదామని వచ్చాను."

"ఏం...రంగడేవన్నా మితిమీరుతున్నాడా?"

"అదేమంత పెద్ద విషయం కాదు"

అని ఎడమ కన్నరమూసి చూసింది.

"అంటే?"

కొంచెం తీవ్రంగా పలికింది రామారావు కంఠం.

"అబ్బే, అలాంటిదేమీ లేదు. పైగా మీరు ఊహించేటంత మనిషి కాదాయన. మనుషుల్ని అర్థం చేసుకోవటంలో మీ రింకా అనుభవం సంపాదించాలి. అసలు మేష్టారూ, మీరు పెళ్ళిచేసుకుంటే కానీ ఇలాటి విషయాలూహించ లేరండీ"

అని చమత్కారంగా నవ్వింది. లలిత పెదవుల కదలికతోనే నవ్వు నాపితే రామారావుకి అందేది కాదు, చిత్ర స్వరంతో ఆమె నవ్వటంతో రామారావు ఆమె వైపు చూశాడు.

నవ్వనేదేమిటో నువ్వయినా అర్థం చేసుకుంటున్నావా?"

"నా నవల చదివినట్టు ఇప్పుడు నమ్మాను. సరిగ్గా అదే వాక్యం నా ఆఖరు అధ్యాయంలో వాడాను"

అంటూనే నవ్వింది.

"నవలలూ నాటకాలూ కావు లలితా జీవితాలు."

"నమ్మలేను, ఇప్పుడే అన్నారు-ఆ నవల నా జీవితమే నని"

"ఎక్కడో కలుస్తాయి అలాంటివి"

"అలానే మీ జీవితమూనూ"

"అంటే?"

"నేనీ సాహసం చేస్తే మీరేమీ అనుకోరు గదా"

అని సోఫాలోనించి లేచి నిలబడింది.

ఒక్క క్షణం రామారావు కనులముందు, మనసు ముందు అంధకారం తాండవించింది. లలిత వాక్యాన్ని పూర్తి చేసి, లేచి నిలబడేలోగా రామారావు మనస్సు మహా ఝంఝంలో ఊగిసలాడి, శరీరమంతా చెమటలు పట్టించేసింది.

"మీరు సౌందర్యాన్ని పెళ్లిచేసుకోవాలి"

అంటూ వీధిలోకి నడిచేసింది.

8

"ఈ మధ్య రంగారావు ఇంటిదగ్గరే ఎక్కువగా ఉంటున్నట్టున్నారు"

అంతర్వాత్మి

గది గడప దాటుతూనే అన్నది, సౌందర్యం.

"ఔను...వస్తూనే ఈ ప్రశ్న వెయ్యాలనిపించిందేం?"

అంది, లలిత సౌందర్యం ప్రశ్నకు కొద్దిగా నొచ్చుకున్నా, ఆ భావం వ్యక్తంకాకుండా చేస్తూ.

"ఆఁ! నాలుగయిదు రోజుల్నుంచీ నేను లోపల కొస్తూండగా ఆయన గేటు దాటుతూండటమో, నేనూ సరిగ్గా మీ రోడ్డుమలుపు తిరిగేసరికి ఆయన కారులో ఎదురయి 'విష్' చేస్తూండటమో జరుగుతోందిలే"

అని నవ్వుతూ లలిత ప్రక్కగా కూర్చుంది, సౌందర్యం.

"బహుశా మీ పెళ్ళి వచ్చే నెలలోనే జరుగుతుందనుకుంటా"

అని ప్రసంగాన్ని మార్చేసింది లలిత.

"ఏమోనమ్మా, అంతా నువ్వు చేశావు. అసలు నాకు..."

"ఏమిటోయ్ అసలు నీకూ..."

"ఏమీ లేదూ. ఇప్పుడెందుకుగానీ, కొత్తగా మొదలు పెట్టిన నవల ఎంతవరకూ వచ్చిందీ?"

"నువ్వు అడిగేవరకూ నాకు గుర్తేలేదు సుమీ; నాలుగయిదు ప్రకరణాలు కాబోలు పూర్తిచేశా... అంతలో—సరిగ్గా ఈ వేళకి వారం పూర్తయింది— మీ చెల్లివచ్చి పట్టుకు చక్కాపోయింది. వ్రాస్తూన్నది పట్టుకుపోతే ఎలా ఉంటుందో చిన్నపిల్లకేం తెలుసూ?"

"ఈ కోతలకేంలే, నీకంత వ్రాయాలని ఉంటే కొత్త ప్రకరణం ప్రారంభించనూ గలవు, లేదా... ఒక్క ట్రిప్ కొట్టేసి తెచ్చుకురాగలవు. అసలు సంగతి దాస్తావేం? బావగారు ఇంటిపట్టున ఎక్కువగా ఉంటున్నట్టున్నారు. అంచేత తీరిక చిక్కటంలేదు. పోనీలెద్దూ, అనెప్పుడన్నా పూర్తి చేసుకోవచ్చు; ఆయన మనసు మారింది. అదే పదివేలు..."

అంటూండగానే రామారావు ప్రవేశించాడు.

రామారావు ప్రవేశంతో ఒక్కసారిగా లేచి నిలబడి పైటచెంగు భుజంమీంచి లాగి కప్పుకుంటూ, సిగ్గుగా తలవాల్చింది, సౌందర్యం. లలిత నవ్వు నాపుకోలేక, అక్కడికే చెంగు ముఖానికి చాటు చేసుకుని, తల ప్రక్కకు తిప్పింది. రామారావు ఎంత దూకుడుగా ప్రవేశించాడో, అంత ఆకస్మికంగానూ నిలబడి పోయాడు. ఒక్క క్షణం అతని ఆలోచన పనిచెయ్య లేదు.

లలిత ఓపిక పట్టలేక;

"రండి మేష్టారూ కూర్చోండి, కొత్త పెళ్ళికూతుర్ని అంతసేపు నిలబెట్టి చూస్తే బెదిరిపోతుంది"

"ఏమిటో నీ పిచ్చికానీ లలితక్కా, ఆయనకు నాకన్న అందంలో, చదువులో, అన్నిటిలో ఎక్కువయిన వాళ్ళే దొరుకుతారు; పది, పదిహేను వేలు కట్నంకూడా యిస్తారు"

"చాలా దుర్భరంగా ఉంది ప్రసంగం"

అంటూ నవ్వుతూ కూర్చున్నాడు రామారావు.

"కంఠమా? విషయమా? దుర్భరంగా ఉన్నదేమిటి గురూత్తమా!"

అని పకాల్న నవ్వింది లలిత.

లలితతో కలిసి యిద్దరూ నవ్వారు.

"ఈ విషయాన్ని ప్రస్తావించబోయే ముందు నువ్వు ఒక్క విషయాన్ని మరిచిపోయావేమో అనిపిస్తోంది"

అని ఆగాడు రామారావు.

"అసలు మనం ఏ విషయాలూ మాట్లాడుకోకుండానే ఇది పెళ్ళికూతురులా సిగ్గునీ, మీరు పెళ్లికొడుకులా హిరణ్యాక్ష వరాలనూ......"

"కాస్సేపు శ్రద్ధగా వింటావూ?"

"సీరియస్‌గా వింటాం చెప్పండి"

అని ఒక చేత్తో తన నోరూ, రెండో చేత్తో సౌందర్యం నోరూ మూసేసింది.

రామారావు నవ్వాడు; నవ్వువచ్చికాదు, కోపం వచ్చి నవ్వాడు.

లలిత నవ్వింది, నవ్వాలనుకుంటూ సౌందర్యం నవ్వింది.

ఒక్క క్షణంలో వాతావరణంలో ప్రశాంతత ఏర్పడింది. కిటికీలోంచి మలయమారుతం వీచే సావకాశం లేక చల్లగాలి మాత్రమే సముద్రపు హోరుతో వస్తూన్నది. కొద్దిగా కనుచీకటి పడుతున్నా గదిలో మనుషుల పోలికలు తెలీనంత స్థితి రాలేదు. అయినా సౌందర్యం లేచి 'స్విచ్' వేసింది. పసుపురంగు దీపం వెలిగింది.

"మాశారా మాస్టారూ, అప్పుడే గదిలో పెళ్లి కళొంచ్చింది పసుపు దీపంతో"

అంది లలిత.

సౌందర్యం, వెలుగుతున్న దీపాన్ని అలానే ఉంచి యింకో స్విచ్ నొక్కింది. మెర్క్యురీ దీపం వెలిగింది.

"మాశారా మాస్టారూ, బుద్ధి పాదరసంలా పని చెయ్యాలి."

అంది లలిత నవ్వుతూ, పైట చెంగుచివర నలిపి చెవిలో తిప్పుకుంటూ.

"ఇంతకూ నా సందేహం విన లేదు"

అన్నాడు రామారావు.

"అంతికం లేటే చెప్ప లేదం లేటే బావుంటుంది... ఏమే సుందరీ...ఔనుకాని మా-స్టా-రూ-చక్కగా సుందరీ! అని పిలవక సౌందర్యం ఏమిటండీ?"

"అది రంగడి పిచ్చి లే. వాడికి ఏపదం దొరికినా దాన్ని తద్ధితం చేసి కాని పలకడు. అందులో నామ వాచకాలు దొరికి తే... మొదట్లో నిన్ను 'లాలిత్యం' అని పిల్చేవాడు గుర్తు లేదూ? అలాగే..."

"మీ రీ వివరణంతా చేస్తున్నారు కానీ..."

"చెప్తున్నా...బహుశా మా పెళ్ళి జరగటం నిశ్చయమయి తే..."

"అయి తే అనకండి. అదెప్పుడో నిశ్చయం అయి పోయింది... పెళ్ళి జరిగాక అనండి"

"ఆ మాటే నేనూ అంటూంట..."

"అని అనేశారూ. తరువాయి కానీండి"

అంటూనే సుందరిచేతిని తన పిడికిలిలోకి తీసుకుంది.

"పెద్ద విశేషం కాదు కానీ, అప్పుడు మా యిద్దరిలో ఒకరం ఉద్యోగం మానాల్సి వస్తుంది".

"ఓస్...ఎవరు మానేసినా మానెయ్యొచ్చు. ఏం—మీకు సర్వీసుమీద విసుగు పుట్టిందా?"

అని సుందరివైపు చూస్తూ కన్ను మీటింది. అయినా సుందరి ఆగక:

"అందుకు నాకేమీ అభ్యంతరం లేదు. ఇరవై యేళ్లు పైబడ్డా పెళ్ళికాక, ఇంటరు ప్యాసయి యింటికి భారంగా, నాన్న యెదురుగా ఓ భూతంలా ఉండడం ఇష్టం లేక సర్వీసులో చేరాను"

అంది.

"సస్పెన్సు పూర్తిగా చంపేశావే. టెంపో తెగిపోయింది మేష్టారూ?"

అంది లలిత లేచి నిలబడి.

రామారావు ముఖంలో ప్రసన్నత ప్రవహించింది.

సుందరి హృదయవనసీమలో మల్లెలు విరిసి మోముపై గుబాళించినవి.

ఆ ముహూర్తంలో లలిత ఇరువురి చేతులూ కలిపి తన గదిలోకి తీసికెళ్ళి, ద్వారబంధం మీదున్న పార్వతీ—పరమేశ్వరుల పాలశిలా విగ్రహాలకు నమస్కరింప జేసింది.

"ఇంక ముహూర్తాలూ, మంగళసూత్రాలూ, పెద్దలూ, పేరంటాలూ తరువాయి విషయాలు. మీకు గుర్తుందా మేష్టారూ, ఆ రోజు సాయంకాలం మా యిద్దరినీ యిలానే ఇక్కడే కలిపారు మీరు"

అని సిగ్గుతో తలవాల్చి, క్రీగంటితో పక్క గోడమీదనున్న తన పెళ్లిఫొటో వైపు చూసింది. అదే క్షణంలో సుందరీ—రామారావులు ఒకరివైపొకరు చిరుసిగ్గుతో చూచుకున్నారు.

"ఈ రాత్రి కిక్కడే ఆగిపోండి. ఆయన ఒక్క గంటలో వచ్చేస్తానని వెళ్ళారు. ఏకంగా భోం చేసేద్దాం...అదిగో కారు హారన్...మనదే...వచ్చేస్తున్నారు. కూడా మా చెల్లీ మరోయిద్దరమ్మాయిలూ వస్తున్నట్టున్నారే" అని చకచక వరండాలోకి నడిచి స్వాగత మిచ్చింది లలిత.

9

"అందుకన్నమాట రంగడు ఈ ఆరుమాసాల నుంచీ ఇంటిదగ్గరుంటూంట" అన్నాడు రామారావు ప్రసంగ మధ్యంలో.

"అంటే?"

అంది లలిత, నోట్లు లెక్క పెట్టి 'బాగ్' లో పెడుతూ.

"అంత అజ్ఞానిని కాదు లలితా! ఒక్కసారిగా బాంక్‌లో ఉన్న సొమ్మంతా తీసికోవలసిన అవసరం ఇంతలో నీకేమి టొచ్చింది?"

"ఏదయినా ఉంటుంది. అంతా చేస్తే మొత్తం అయిదు వేలు లేదు, నా సంపాదన"

"కావచ్చు, కానీ...రంగడిదగ్గర డబ్బు పూర్తిగా అయిపోయి ఉంటుంది. వ్యాపారంలో పెద్ద దెబ్బ తిన్నాడు. అందులో వరదలికి రాజమండ్రీలో పేపరు గోడౌను పూర్తిగా లాగేసిందని విన్నాను. ఇప్పుడు మళ్ళీ వాడికి పెట్టుబడి కావాలి. వ్యాపారంలో మునిగి

పోయినవాణ్ణి ఉద్ధరించటానికి ఎవరూ ముందుకురారు. అందుకనీ...అయినా డాబా తణఖా పెడ్తే..."

"ఉచితంగా యిచ్చే సలహాలలో ఔచిత్యం ఉంటే ఎంత బావుంటుంది రామం...పోనీలే, భార్య దగ్గర అయిదు వేలు బాంకిలో మూలుగు తూండగా భర్తకి ఇల్లు తణఖా పెట్టవలసిన అవసరం?"

"వాడి కీనాటివరకూ భార్యా-భర్తృ సంబంధ జ్ఞానం నశించింది కనక"

"అంతలో అనుబంధం చెడుతుందా?"

అని నవ్వింది లలిత.

"అయితే నీ సంపాదన కూడా వాడి తిరుగుళ్ళకు ధారపోస్తున్నానన్న మాట"

"మీరింత నీచంగా ఊహిస్తారనుకోలేదు, క్షమించండి - కొంచెం కటువుగా మాట్లాడినట్లున్నాను. మీరే నాస్థితిలో ఉంటే మీరు కూడా నేను చేస్తున్నట్టే చెయ్యనినాడు సంసారం చట్టుబండలవుతుంది."

అని తల ప్రక్కకు తిప్పింది. అంతలో చేతిలో జేబురుమాల్ ఊపుకుంటూ వస్తూన్న సుందరి కనిపించింది. లలిత తమాయించుకుని :

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడగనున్నారు. మొత్తం పది వేలతో ఆయన పబ్లిషింగ్ హౌస్ ప్రారంభిస్తున్నారు. మాదగ్గర అయిదు వేలున్నాయి. మీరూ అయిదు వేలిస్తే......"

"నేనంత చవటని కాదు లలితా"

అని రామారావు కోపంగా అంటుండగా ప్రవేశించిన సుందరి ఇరువురినీ చూచి ఒక్క క్షణం స్తంభించి నిలబడి :

"ఏదో చాలా తీవ్రంగా నడుస్తూన్నట్టుంది" అంటూ లలిత దగ్గిరకూర్చుంది.

"వ్యాపారానికి సీరియస్ నెస్ అవసరంలే, అయితే మిస్టర్ రామం, మీకు షేర్ తీసికోవటం సుతరామూ ఇష్టంలేనట్లైనా? ఈ అయిదు వేలూ మీరిచ్చేస్తే బాధలేదు. లేకపోతే..."

అని లలిత చెప్తూండగా నే :

లేకపోతే డాబా అమ్మేసుకుంటాడా? వీల్లేదని చెప్పు; నీకు గుర్తులేదేమో, డాబా నీ పేరఉంది..."

అని తీవ్రంగా పలికాడు.

"అబ్బబ్బ! మీరంత హైరాను పడిపోతే ఎలా?"

అంది లలిత నవ్వుతూ, సుందరివైపు చూసి.

"అసలేమిటో నాతో చెప్పవే; ఆయనకేంటివేం తెలుసూ, వండిపెట్టే పులుసులో పులుపు సరిపోయిందా అంటే 'బాగానే ఉంది' అంటారేకాని, ఏం కావాలో తెలీదాయనకు"

అంది సుందరి లలితమీదికి జరిగి, ఆమె తల తన వైపుకు త్రిప్పిపట్టుకుని.

"చెప్పు...ఆవిడ తీరుస్తుంది నీ కోరిక"

అని గట్టిగా అగ్గి పుల్ల కొట్టి, సిగరెట్ ముట్టించాడు.

"మరేం లేదే, ఈ అయిదు వేలతో స్టాకు తీసుకుని హైదరాబాద్‌లో వ్యాపారంచేస్తే సంవత్సరంలో రెట్టింపు తియ్యవచ్చు. కాని ఈ సంవత్సరంలో పదివేలూ పెడ్తే సుమారు పాతిక వేలు రావొచ్చు."

అంది లలిత.

నేను వాణ్ణి నమ్మను లలితా; పెళ్ళయిన నాలు గేళ్ళు తిరక్కుండా కట్టుకున్న పెళ్ళాం సంతానవతి కాలేదని సంవత్సరంనర నానా హింసలూ పెట్టి, అన్ని తిరుగుళ్ళూ తిరిగీ, వ్యాపారంలో సర్వనాశనం అయి..."

ఉపన్యాస ధోరణిలో పోతూన్న రామారావుని ఆపటానికి ఏం తోచక : "చాల్లెద్దురూ...మీ కన్నీ అలాగే కనిపిస్తాయి. లలిత కిప్పుడు అయిదో నెల... తెలుసా ?"

అని లలితతో వంటింట్లోకి నడిచేసింది, సుందరి.

'W - H - A - T!!' (వ్హా...ట్!!)

అని రామారావు సోఫాలో వెనక్కు వాలాడు. రెండు కాళ్లూ మేజామీద ఉంచుతూ. వంటింట్లోంచి కిలకిలలు వినిపిస్తున్నాయి. గేట్లో రంగారావు కారు హారన్ ఆగకుండా మ్రోగుతోంది. "ఒరేయ్, రావుడూ!" అన్న రంగడి చిన్ననాటికేక రామారావుని అమాంతం కారు దగ్గరికి నడిపింది.